సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



కంపించిన భూమి

పరిగి మండలంలో గురువారం తెల్లవారు జామున భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. 12లో▸



అవగాహనతో..

అవగాహనతో టీబీ వ్యాధి నిర్మూల సాధ్యమని అంగడిరాయిచూర్ పీహెచ్‌సీ వైద్యురాలు బుస్రాఫాతిమా అన్నారు. 13లో▸



కాంగ్రెస్‌ను నమ్మరు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. 13లో▸

న్యూస్‌రీల్

బీజేపీ జిల్లా కార్యవర్గం ఏర్పాటు

అనంతగిరి: భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ గురువారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీధర్‌రెడ్డి, వివేకానంద రెడ్డి, జి.శివరాజు, పటేల్ సాయిరెడ్డి, సుదర్శన్‌గౌడ్, బినాపూర్ యాదయ్య, ప్రధాన కార్యదర్శులుగా పెంటయ్య గుప్తా, పటేల్ విజయ్‌కుమార్, రాయిపల్లి మాధవి, కార్యదర్శులుగా బంటారం లావణ్య, లక్ష్మణ్, జుంటుపల్లి వెంకట్, హరికృష్ణ యాదవ్, రఘుపతి, అంగోతు శంకర్‌నాయక్, కోశాధికారిగా హనుమంత్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా విజయలక్ష్మి, సోషల్ మీడియా ఇంచార్జిగా టి.రాఘవేందర్, మీడియా సెల్ కన్వీనర్‌గా మోహన్‌రెడ్డి, ఐటీ సెల్ ఇంచార్జిగా మంగళి రవీందర్‌ను నియమించారు.

పరిశుభ్రత పాటించాల్సిందే



మటన్ షాపును పరిశీలిస్తున్న సదానందం

అనంతగిరి: మాంసం దుకాణా యజమానులు షాపులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం ఆదేశించారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని బీఫ్, మటన్, చికెన్ సెంటర్లను తనిఖీ చేశారు. మాంసం ఉత్పత్తులపై ఈగలు వాలకుండా, దుమ్ము పడకుండా ప్లాస్టిక్ కవర్ కప్పాలన్నారు. షాపు శుభ్రంగా లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆరోగ్యంగా ఉన్న మేకలు, గొర్రెలను మాత్రమే కోయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ విజయలక్ష్మి, సిబ్బంది మొగులప్ప, హాజీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు గురువారం రాత్రి వికారాబాద్‌లో ఆ పార్టీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ కుమ్మక్కై ప్రజల ఓటు హక్కును దుర్వినియోగం చేశారని నేతలు ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు తాండూరుకు కూనంనేని రాక

తాండూరు టౌన్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈనెల 16న తాండూరుకు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న పార్టీ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అలాగే జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మ రానున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

అవినీతే అసలు సమస్య!

- స్వేచ్ఛ, సమానత్వం అందరికీ అందాలి
- యంత్రాంగం మరింత పటిష్టంగా పనిచేయాలి
- 'సాక్షి' సర్వేలో జిల్లా ప్రజల అభిప్రాయం

సమాజంలో అవినీతే ప్రధాన సమస్యగా మారిందని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడ్డారు. స్వాతంత్య్రం సిద్ధించి 79 ఏళ్లు గడుస్తున్నా స్వేచ్ఛ, సమానత్వం అన్నివర్గాలకు అందడం లేదని తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వివిధ వర్గాలకు చెందిన 60 మందిని 'సాక్షి' సర్వే చేయగా 24 మంది వ్యవస్థలో అవినీతి పేరుకుపోయిందని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం వంటివి అందరికీ అందడం లేదని 23 మంది తెలిపారు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే అధికార యంత్రాంగం మరింత పకడ్బందీగా పనిచేయాలని 22 మంది, చట్ట సభల్లో మార్పు రావాలని 16 మంది తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

– కొడంగల్/బొంరాస్‌పేట



మీరు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఏది?



స్వేచ్ఛ- సమానత్వం అందరికీ చేరుతోందా..?



స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే మరింత నిజాయితీగా పనిచేయాల్సిన రంగం ఏది?



పోటెత్తిన వరద

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం

- పరిగిలో అత్యధికంగా 127 మిల్లీ మీటర్లు నమోదు
- నీట మునిగిన పంటలు
- కొట్టుకుపోయిన రోడ్లు
- పలు చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- వరద ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు



అలుగు పారుతున్న బొంరాస్‌పేట చెరువు

వికారాబాద్: జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. రెండు రోజుల క్రితం ప్రారంభమైన వాన ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. గడిచిన 24 గంటల్లో మరింత ఉధృతంగా మారింది. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. బుధవారం రోజంతా భారీ వర్షం పడింది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్ని చోట్ల చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. యెరువులకు గండ్లు పడ్డాయి. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులన్నీ నిండుగా కనిపిస్తున్నాయి. వాగులు పోటెత్తడంతో ఆయా మార్గాల్లోని వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిగి పట్టణంలో అత్యధికంగా 127 మిల్లీ మీటర్లు, దోమలో 118.5, పూడూరులో 97.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. గురువారం ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు.

నిండుకుండల్లా ప్రాజెకులు

జిల్లాలో 1,187 చెరువులు ఉండగా చాలా వరకు పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం 311 అలుగు పారుతుండగా మరో 294 పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువయ్యాయి. కాలువలు సరిగ్గాలేని, ఆక్రమణలకు గురైనా చెరువులు మాత్రం నిండలేదు. ప్రధాన ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. లఖ్నాపూర్, కాకరవాణి, నందివాగు, అల్లాపూర్ , శివసాగర్, సర్పన్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు అలుగు పారుతున్నాయి. మరో రెండు మూడు రోజుల పాటు వరద ఉధృతి ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

వాగులు ఉగ్రరూపం

- జిల్లాలోని కాగ్నా, మూసీ, ఈసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- ధారూరు మండలం దోర్నాల, రుద్రారం, నాగసముందర్, పరిగి వాగు, గొడుగోనిపల్లి, గెర్గేట్‌పల్లి, ధన్నారం మార్గాల్లో వాగులు బ్రిడ్జల పైనుంచి ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలు బందయ్యాయి. బంట్వారం మండలంలోని నూర్లపూర్ వాగు పొంగిపొర్లుతోంది.
- ధారూరు మండలం గురుదొట్ల చెరువుకు గండి పడటంతో నీరంతా పంట పొలాల్లోకి చేరింది. అప్రమత్తమైన అధికారులు గండిని పూడ్చారు.
- తాండూరు నియోజకవర్గంలో భారీ వర్షాలకు కగ్నా పరవళ్లు తొక్కుతోంది. బషీరాబాద్, యాలాల, తాండూరు మండలాల్లో పలు చోట్ల కగ్నా ఉధృతికి రాకపోకలు ఆగిపోయాయి.
- జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.
- వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీధుల్లో నడిచే పరిస్థితి లేకుండా పోయింది.

అప్రమత్తమైన యంత్రాంగం

భారీ వర్షాలు పడతాయన్న ముందస్తు హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందిని సమాయత్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 50కి పైగా ప్రమాదకర స్థలాలను గుర్తించి రెవెన్యూ, పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లాలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం

మండలం	మిల్లీ మీటర్లలో..
మర్పల్లి	32.8
మోమిన్‌పేట్	29.8
నవాబుపేట	64.7
వికారాబాద్	79.7
పూడూరు	97.5
పరిగి	127
కుల్కచర్ల	64.5
దోమ	118.5
బొంరాస్‌పేట్	59.7
ధారూరు	97.5
కోట్‌పల్లి	36.3
బంట్వారం	16.1
పెద్దేముల్	48.2
తాండూరు	65.4
బషీరాబాద్	73.7
యాలాల	71.5
కొడంగల్	75.2
దౌల్తాబాద్	44.4
చౌడాపూర్	68
దుద్యాల్	68



బషీరాబాద్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న కాగ్నా

అన్ని చర్యలు తీసుకున్నాం

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని చర్యలు తీసుకున్నాం. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. అత్యవసర సేవలు అవసరమైన వారు సెల్ నంబర్ల 7995061192, 08416235291లో సంప్రదించాలి. జిల్లాలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్

బందోబస్తు ఏర్పాటు చేశాం

అత్యవసర సేవల కోసం డయల్ 100కు కాల్ చేయాలి. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, ప్రాజెక్టుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వాగులు దాటే ప్రయ త్నం చేయరాదు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండరాదు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు ఒరిగినా, వైర్లు తెగి పడినా సమాచారం ఇవ్వాలి.

– నారాయణరెడ్డి, ఎస్పీ

మార్పుతోనే ప్రగతి

సాక్షి TALK SHOW

'విద్య, వైద్యం, వ్యవసాయం, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు రావాలి.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ సాగును ప్రోత్సహించాలి.. పారిశ్రామిక రంగాన్ని విస్తరించి యువత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి.. అన్ని రంగాల్లో సమూల మార్పు వచ్చినప్పుడే దేశ ప్రగతి సాధ్యం' అని తాండూరు పట్టణంలోని పీపుల్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వందేళ్ల భారత్ ఎలా ఉండాలి అనే అంశంపై గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో కళాశాలలో చర్చ వేదిక నిర్వహించారు. విద్యార్థులు వారి అభిప్రాయాలను పంచుకున్నారు.

– తాండూరు/తాండూరు టౌన్

- తాండూరులోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలో 'సాక్షి' టాక్ షో
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న ఉత్తమ్‌చంద్

లంచాన్ని నిర్మూలించాలి



దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ లంచగొండితనం అదే స్థాయిలో ఉంది. దాన్ని పూర్తిగా నిర్మూలించాలి. గ్రామీణ ప్రాంతాలకు విద్య, వైద్యం చేరాలి.

– ఆకాష్ రాథోడ్, బీఏ ద్వితీయ సంవత్సరం

విద్య, వైద్యం మెరుగు పడాలి



స్వాతంత్య్రం సిద్ధించి 78 సంవత్సరాలు పూర్తయినా నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ విద్య అందడం లేదు. సరైన వైద్య సేవలు లేవు. విద్య, వైద్య రంగాలను మెరుగు పర్చాలి.

– అబ్దుల్, డిగ్రీ విద్యార్థి

సేంద్రియ సాగును ప్రోత్సహించాలి



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రావాలి. రసాయన ఎరువులను పూర్తిగా తగ్గించి సేంద్రియ సాగును ప్రోత్సహించాలి. అందరికీ సమాన విద్య దిశగా చర్యలు చేపట్టాలి.

– మౌనిక, బీఎస్సీ ఫస్ట్ ఇయర్

పారిశ్రామిక ప్రగతి అవసరం



స్థానికంగా యువతకు ఉద్యోగావకాశాలు లభించాలంటే పారిశ్రామిక ప్రగతి ఎంతో అవసరం. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగు పర్చాలి.

– కావేరి, బీకాం ఫస్ట్ ఇయర్

మెరుగైన రవాణా వ్యవస్థ ఉండాలి



ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రవాణా వ్యవస్థ ఎంతో కీలకం. మారుమూల ప్రాంతాలకు సరైన రోడ్లు, బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందడం లేదు. ప్రజలను సోమరులుగా మార్చే ఉచిత పథకాలను రద్దు చేయాలి. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– నాగ వైష్ణవి, బీఎస్సీ

వృక్ష సంపదను పెంచాలి



దేశంలో వాతావరణ కాలుష్యం రోజు రోజుకూ పెరిగి పోతోంది. పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేయాలి. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ స్థానంలో బయో డీజిల్‌ను వినియోగించాలి. వృక్ష సంపదను పెంచాలి.

– హీనా, కంప్యూటర్ సైన్స్

జిల్లాకో విశ్వవిద్యాలయం ఉండాలి



ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య అందించేలా ప్రత్యేక చొరవ చూపాలి. ప్రతి జిల్లాకు ఒక విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలి. మేకిన్ ఇండియాలో భాగంగా విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి.

– సాదియా, బీఏ సెకండ్ ఇయర్

సాంకేతిక విద్య అవసరం



అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే శాస్త్ర, సాంకేతిక రంగాలను ప్రోత్సహించాలి. ఆ దిశగా విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ఇటీవల కాలంలో రసాయన ఎరువుల వాడకం పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

– లక్ష్మి, కంప్యూటర్ సైన్స్ ఫస్ట్ ఇయర్

నిరుద్యోగులు లేని దేశం కావాలి



ప్రస్తుతం దేశంలో నిరుద్యోగ యువతం ఎక్కువగా ఉంది. దేశం అభివృద్ధి చెందాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడాలి. అప్పుడే ఆర్థిక, సామాజిక పురోగతి సాధిస్తాం.

– రాథోడ్ దేవ్‌జీ, కంప్యూటర్ సైన్స్, థర్డియర్

అందరికీ విద్య వైద్యం అందాలి



పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందాలి. దేశంలో ఆర్థిక అసమానతల వల్ల సమాన హక్కులు సాధ్యం కావడం లేదు. ఇటీవల కాలంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది.

– అయేషాబేగం, బీఎస్సీ

ఉచితాలతో అనర్థం



వ్యవసాయ, శాస్త్ర, సాంకేతిక రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగు పర్చాలంటూ విద్యార్థులు ఆలోచించడం అభినందనీయం. ఉచిత పథకాల వల్ల జనాలు సోమరులు అవుతున్నారన్న మాటలు ఆలోచింప జేస్తున్నాయి.

– చంద్రకళ, ప్రిన్సిపాల్

విప్లవాత్మక మార్పులు రావాలి



దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడింది. పాలకులు తీసుకున్న నిర్ణయాలు దేశాభివృద్ధికి దోహదం చేశాయి. పీవీ తీసుకున్న నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశాయి. జవహర్‌లాల్‌నెహ్రూ నుంచి ప్రస్తుత ప్రధాని మోదీ వరకు అభివృద్ధే లక్ష్యంగా సాగారు. 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించి ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుంది.

– ఉత్తమ్‌చంద్, కరస్పాండెంట్, పీపుల్స్ కళాశాల

తారతమ్యాలు ఉండొద్దు



దేశంలో పేద, ధనిక అనే తారతమ్యాలు ఉండరాదు. పేదరికాన్ని నిర్మూలించాలంటే విద్య, వైద్య రంగాలు మెరుగు పడాలి.

– శ్రీలత, బీకాం ఫస్ట్ ఇయర్

అప్రమత్తంగా ఉన్నాం

- భారీ వర్షాలను సమర్థవంతంగా ఎదుర్కొంటాం
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లాలో అతి భారీ వర్షం కురిసినా సమర్థవంతంగా ఎదుర్కొంటాం.. అందుకు అధికారులను సమాయత్తం చేశామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. గురువారం నగరం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం కొడంగల్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతాలను మూసివేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందేలా చూస్తాం

తాండూరు: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట వివరాలు సేకరించి రైతులకు పరిహారం అందేలా చూస్తామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం తాండూరు నియోజకవర్గంలోని వరద ప్రాంతాలను ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో కలిసి సందర్శించారు. పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందరాదని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఇళ్లలోనే ఉండాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

అప్రమత్తంగా ఉండాలి

బొంరాస్‌పేట: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని బొంరాస్‌పేట పెద్ద చెరువు అలుగును, నిర్మాణంలోని వంతెనను పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట సీఐ శ్రీధర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మరికల్ రామాలయంలో భారీ చోరీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ విక్రమ్

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ రామాలయంలో గురువారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండలు లోనికి చొరబడి వెండి కిరీటాలు, బంగారు పుస్తెమెట్టెలు ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షల ఉంటుందని స్థానికులు తెలిపారు. ఉదయం దేవాలయానికి వెళ్లిన భక్తులకు చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. నవాబ్‌పేట్ ఎస్‌ఐ విక్రమ్ గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీంను రప్పించి, ఫింగర్ ప్రింట్స్, ఆధారాలు సేకరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మీర్‌పేట: పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడలో నివాసముండే ముత్తయ్య తన ద్విచక్ర వాహనాన్ని బాలాపూర్ చౌరస్తాలో బుధవారం పార్కు చేసి పని నిమిత్తం సొంత గ్రామానికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి వాహనం కనిపించలేదు. అక్కడే ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఓ దొంగ వాహనాన్ని చోరీ చేసినట్లు తెలుసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్, దుకాణాల్లో తనిఖీలు



హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

తుర్కయంజాల్: హోటళ్లు, బేకరీలు, దుకాణాల యజమానులు పాడైపోయిన ఆహార పదార్థాలను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వనిత హెచ్చరించారు. గురువారం ఆమె కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాగన్నగూడలోని డెక్కన్ బావర్చి హోటల్‌ను తనిఖీ చేయగా పలు ఆహార పదార్థాలు పాడైపోయినట్లు, నిల్వ ఉంచినట్లు గుర్తించారు. కిచెన్ పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో రూ.10 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఓ కిరాణ దుకాణంలో గడువు ముగిసిన బ్రెడ్ ప్యాకెట్ విక్రయిస్తుండగా అతడికి రూ.1,000 జరిమానా విధించారని వివరించారు.

పెయింటర్ అదృశ్యం

మొయినాబాద్: పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన పెయింటర్ అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సురేష్ బచ్చా ప్రసాద్(50) కుటుంబ సభ్యులతో కలిసి రెండేళ్ల క్రితం హిమాయత్‌నగర్‌కు వలసవచ్చాడు. ఇక్కడే పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 12న ఉదయం 6 గంటలకు పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య మంజు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వీధికుక్కలను పట్టుకెళ్లిన జంతు సంరక్షకులు



వీధి కుక్కలను పడుతున్న జంతు సంరక్షకులు

షాబాద్: వీధి కుక్కలను పట్టి బహిరంగ ప్రదేశంలో వదిలిపెట్టినట్లు సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలు అన్నారు. గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో జంతు సంరక్షకులు వీధి కుక్కలను పట్టుకెళ్లారు. వాటికి తీసుకెళ్లేందుకు అయ్యే ఖర్చును జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి రూ.20వేల నగదును అందజేసినట్లు ఆయన తెలిపారు. గత నాలుగు రోజుల క్రితం సర్దార్‌నగర్ గ్రామంలో ఎనిమిది మందిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన పాఠకులకు విధితమే. రోజు రోజుకు వీధి కుక్కలు మనుషులపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వాటిని పట్టించినట్లు తెలిపారు. ప్రజలకు వీధి కుక్కల భయం లేకుండా చేశామని ఆయన స్పష్టం చేశారు.

చంపినా ఇంతేనా?

- ఎమ్మెల్యేలు ఫోన్ చేస్తే హంతకులనూ వదిలేస్తారా..
- ధారూరు పోలీసుల తీరుపై బాధితుల మండిపాటు
- పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన
- ఉన్నతాధికారులు, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆవేదన



ధారూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న క్షతగాత్రులు

ధారూరు: పేదలను చంపినా పట్టించుకోరా..? ఎమ్మెల్యేలు, నాయకులు ఫోన్లు చేస్తే హత్యలకు పాల్పడే వారిని కూడా వదిలేస్తారా..? పది మంది యువకులు మద్యం, గంజాయి మత్తులో గొడ్డలితో పాటు ఇతర మారణాయుధాలతో దాడి చేసినా.. రాజకీయాలకు ఒత్తిడికి తలొగ్గి వాస్తవాలను దాచిపెట్టి, పెట్టీ కేసులు పెట్టి వదిలేస్తారా అంటూ బాధిత భార్యాభర్తలు కన్నీటి పర్యంతమయ్యారు. సామాన్యులకు జరిగే న్యాయం ఇదేనా.. అని పోలీసులను నిలదీశారు. నాగారంలో హోటల్ నిర్వహిస్తూ బతుకీడుతున్న తమపై బుధవారం రాత్రి కారులో వచ్చిన పది మంది యువకులు దాడి చేశారన్నారు. నూడుల్స్‌లో నూనె తక్కువగా వేశారంటూ మారణాయుధాలతో గాయపర్చారని, అడ్డువచ్చిన మరో ఇద్దరిని సైతం దారుణంగా కొట్టారని బాధిత దంపతులు నీరటి భారతమ్మ, అంజి గురువారం ఆవేదన వ్యక్తంచేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన యాలాల మండల రాస్నం యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. లేదంటే తాము ఉన్నతాధికారులతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. తమతో తెల్ల కాగితంపై సంతకాలు తీసుకున్న పోలీసులు కేసును నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దాడికి పాల్పడిన పది మందిలో కేవలం ముగ్గురిని మాత్రమే పట్టుకుని మిగిలిన వారిని వదిలేశారని ఆరోపించారు. తామకు న్యాయం జరగకపోతే పోలీస్ స్టేషన్ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'



శంకర్‌పల్లిలో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు, విద్యార్థులు



షాద్‌నగర్‌రూరల్: జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న నేతలు

శంకర్‌పల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పట్టణ బీజేపీ నేతల ఆధ్వర్యంలో గురువారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా.. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, శ్రేణులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలంతా ఒక్కటే అని, ప్రతి ఒక్కరూ స్వాతంత్య్రం కోసం పోరాడిన వీరులను నిరంతరం గుర్తుచేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్, మండల అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, లీలావతి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, ప్రతాప్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో దేశభక్తిని చాటుదాం

షాద్‌నగర్‌రూరల్: దేశంలోని ప్రజలందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చి దేశభక్తిని చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశాల మేరకు గురువారం తిరంగా ర్యాలీ ఇన్‌చార్జి చెట్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ అధ్యక్షతన హర్‌ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గల దుకాణాల్లో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు సురేష్, అశోక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధితో లాభాలు

పశువైద్య విశ్వవిద్యాలయం రిటైర్డ్ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి

షాబాద్: పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే రైతులకు మంచి లాభాలు వస్తాయని పశువైద్య విశ్వవిద్యాలయం రిటైర్డ్ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కక్కులూర్ గ్రామంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో జిల్లా శాస్త్రీయ పద్ధతుల డెయిరీ సాగు, పాల ఉత్పత్తుల విలువల జోడింపుపై మహిళలకు, యువకులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకం, పాల పదార్థాల తయారీపై పాడి రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఫార్మర్ డీన్ ప్రొఫెసర్ రఘునందన్ పశుపోషణ, షెడ్ నిర్మాణం, తక్కువ లాభాలు వంటి అంశాలపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా చేయగల మజ్జిగ, నెయ్యి, క్రీమ్ తయారీపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో సుగుణమాల షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి, మహిళా పాడి రైతులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి
- ఎంపీడీఓ బన్సీలాల్



అయ్యవారిపల్లి వాగు వద్ద పరిస్థితిని తెలుసుకుంటున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగు, నాగులపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆయన వాగుల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి రక్షణ చర్యలను చేపట్టారు. అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించి వాగుల మీదుగా రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున.. అత్యవసర సమయాల్లో తప్పా ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సూచించారు. వాగులు, చెరువుల పరిసర ప్రాంతాలలోకి ప్రజలు రావొద్దని సూచించారు. అత్యవసర సమాచారం కోసం మండల పరిషత్ కార్యాలయంలో 24 గంటలు కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాలలో 8686793747, 9441947364 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, ముజఫర్నిసా భేగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నందిగామలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నందిగామ: భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల కేంద్రమైన నందిగామలోని తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు గురువారం తహసీల్దారు రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం, జంతు నష్టం తదితర సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే గ్రామస్తులు, లేదా బాధితులు తహసీల్దారు కార్యాలయంలో ఫోన్ నం.8019884605, 9866023923లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మూడురోజుల పాటు అందుబాటులో..

కేశంపేట: వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో కంట్రోల్ రూంను తహసీల్దార్ అజాంఅలీ ఏర్పాటు చేశారు. శుక్రవారం సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్ (7799363553), శివ జూనియర్ అసిస్టెంట్ (9398094490), శనివారం గిర్దావర్ చెన్నకేశవులు (9948044523), రికార్డు అసిస్టెంట్ జంగయ్య (9912170411), ఆదివారం జూనియర్ అసిస్టెంట్ మహేశ్ (9441579527), జూనియర్ అసిస్టెంట్ జంగేశ్ (9848206029)లు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

సీసీకెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

ఏసీపీ లక్ష్మీనారాయణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను కట్టడి చేయొచ్చని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్‌లో కాంగ్రెస్ నేత రాయికల్ శ్రీనివాస్ తన సొంత నిధులు రూ.2లక్షలతో గ్రామంలో సీసీకెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ కెమెరాలను గురువారం ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలను నియంత్రించడంలో కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. రాయికల్ గ్రామం జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో రద్దీగా ఉంటుందని, గ్రామంలో భద్రతా చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సీఐ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ ఆశన్నగౌడ్, దిద్దుల కృష్ణయ్య, పాండు నాయక్, నాయకులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

కార్మికుడి మృతి

తాండూరు రూరల్: సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని గౌతపూర్ అనుబంధ గ్రామం గోపన్‌పల్లి వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాథోడ్ వినోద్ కథనం ప్రకారం.. ఎల్మకన్నె గ్రామానికి చెందిన షేక్‌పాషా(60) బెల్కటూర్ సమీపంలో ఉన్న సీసీఐ రైల్వేట్రాక్ వద్ద కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆయన బుధవారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై తాండూరుకు వస్తున్నాడు. ఇదే క్రమంలో గోపన్‌పల్లి వద్ద గుర్తు తెలియని ఓ సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో షేక్‌పాషాకు తీవ్రగాయాలు కావడంతో తాండూరు జిల్లా ఆస్పత్రికి స్థానికులు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

యాలాల: ఎదురుగా వస్తున్న ఓ బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తాండూరు–కోకట్ మార్గంలోని సాయిబాబా ఆలయ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం కందనెల్లికి చెందిన దంపతులు పల్లె అనంతయ్య, పల్లె పద్మమ్మ(50) టీవీఎస్ బైక్‌పై కోకట్ నుంచి తాండూరు వైపు వస్తున్నారు. ఈ క్రమంలో సాయిబాబా ఆలయ సమీపంలో తాండూరు వైపు నుంచి వస్తున్న కారు వీరిని ఢీకొంది. ఈ ఘటనలో పద్మమ్మ మృతి చెందగా, అనంతయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు దాతల సహకారం

కేశంపేట: విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు దాతలు అందించే సహాయంతో చదువుల్లో ఉన్నతంగా ఎదగాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ ఆర్థిక సాయంతో 150 విద్యార్థులకు గుర్తింపు కార్డులు, టై, బెల్టులు అందజేశారు. అదే విధంగా దత్తాయపల్లిలో గ్రామస్తులు భాస్కర్‌గౌడ్, కానుగ రవి సాయంతో 25 మంది విద్యార్థులకు టై, బెల్టు, షూస్, గుర్తింపు కార్డులను అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ పాల్గొని దాతలతో కలిసి విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చక్రధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంపించిన భూమి

3 నుంచి 4 సెకండ్ల పాటు ప్రకంపనలు



రంగాపూర్‌లో వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

- ఇళ్లలోంచి పరుగులు తీసిన జనం
- గ్రామాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

పరిగి: మండలంలో భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గురువారం తెల్లవారుజామున 3.55గంటలకు బసిరెడ్డిపల్లి, రంగాపూర్, న్యాయత్‌నగర్, హనుమాన్‌గండి గ్రామాల్లో 3 నుంచి 4 సెకండ్ల పాటు ప్రకంపనలు వచ్చాయి. ఇళ్లలోని సామగ్రి కింద పడటంతో ప్రజలు బయటికి పరుగులు తీశారు. ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. గతంలో ఒకసారి బసిరెడ్డిపల్లిలో భూమి కంపించిన విషయం తెలిసిందే.

ధైర్యంగా ఉండాలి: కలెక్టర్

విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి గురువారం బసిరెడ్డిపల్లి, రంగాపూర్ గ్రామాలను సందర్శించారు. భూమి కంపించడంపై ఆరా తీశారు. ఇళ్లకు పగుళ్లు వచ్చి ఉంటే ఆ సమాచారం సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచించారు. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు పొలాలకు వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పూడూరు మండలంలో..

పూడూరు: మండలంలోని కెరవెళ్లి, దేవనోనిగు, సిరిగాయపల్లి, సోమన్‌గుర్తి గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున భూమి కంపించింది. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ పాండు దేవనోనిగుడ గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుందర్, గ్రామస్తులు నారాయణ, పెద్ద నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుంతలో పడి వ్యక్తి దుర్మరణం

తాగిన మైకంలో అత్తారింటికి వస్తుండగా ఘటన



అంజిలయ్య (ఫైల్)

తాండూరు రూరల్: తాగిన మైకంలో ఓ వ్యక్తి గుంతలో పడి మృతి చెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంబాపూర్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణుకుమార్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చెంచు అంజిలయ్య(41), భార్య లక్ష్మి, కూతురు స్వాతితో కలిసి హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. లక్ష్మి తన సోదరుడికి రాఖీ కట్టేందుకు పెద్దేముల్ మండలం చైతన్యనగర్‌కు మంగళవారం భర్త, కూతురితో కలిసి మంబాపూర్ వచ్చారు. బస్సు దిగిన వెంటనే అంజిలయ్య ‘మీరు చైతన్యనగర్‌కి వెళ్లండి, నేను తర్వాత వస్తాను’ అని భార్యాబిడ్డకి చెప్పి పంపించాడు. అదే రోజు రాత్రయినా ఆయన ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అసాధ్యమైన ప్రాంతాల్లో వెతికారు. మొబైల్ సైతం స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇదిలా ఉండగా గురువారం మంబాపూర్ గ్రామ శివారులోని మైసమ్మ దేవాలయం వద్ద గుంతలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పరిశీలించారు. ఈ క్రమంలో మృతదేహాన్ని చూసిన లక్ష్మి తన భర్త అంజిలయ్యగా గుర్తించారు. మంగళవారం రాత్రి తాగిన మైకంలో మంబాపూర్ నుంచి చైతన్యనగర్‌కు వెళ్లే క్రమంలో గుంతలో పడి మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వర్షపునీరు వెళ్లేందుకు చర్యలు



రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని పరిశీలిస్తున్న అధికారులు

కేశంపేట: మండల కేంద్రంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో వాహనదారులు, విద్యుత్ సిబ్బంది రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యెన్నం శ్రీధర్‌రెడ్డి అర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రకుమార్, అర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్యలతో కలసి వర్షపునీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. నీరు వెళ్లేందుకు అనువుగా గతంలో ఉన్న కల్వర్టును పునరుద్ధరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మఠం చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యావతిదేవి, కారోబార్ రవి, కోడిపర్తి శ్రీకాంత్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న ఖురేషీభాయ్‌కి రిమాండ్

శంకర్‌పల్లి: పట్టణ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద ఖురేషీబాయ్ అనే వ్యక్తి మెయింటెనెన్స్ పేరిట అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నాడని ఇటీవల పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు అతనిపై శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఇదే వ్యక్తిపై 2023లో నగరంలోని భవానీనగర్ పీఎస్‌లో ఫోర్జరీ, ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేశాడనే ఆరోపణలపై కేసు నమోదైంది. ఈకేసులో గురువారం అతన్ని అరెస్టు చేసిన భవానీనగర్ పోలీసులు రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ విషయంపై శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్‌ని వివరణ సంప్రదించగా.. ఖురేషి పై 2018లో కారు యాక్సిడెంట్ కేసు, 2025లో బెదిరింపు కేసు, ఇదే ఏడాదిలో అక్రమంగా మెయింటెనెన్స్ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మా ఊరిలో మందు బంద్

- పలు గ్రామాల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం
- మహిళల చైతన్యంతో



కిషన్‌నగర్‌లో మద్యపాన నిషేధ పోరాటానికి మద్దతు తెలుపుతున్న స్థానికులు (ఫైల్)

షాద్‌నగర్: కేశంపేట మండలం బోదనంపల్లిలో 14 ఏళ్ల క్రితం మొదలైన సంపూర్ణ మద్యపాన నిషేధం ఈ రోజు వరకూ అలాగే కొనసాగుతోంది. ఈగ్రామంలో ఎక్కడా బెల్టు షాపులు, మద్యం సేవించడం కనిపించదు. మద్యం ప్రియులు కావాలనును కుంటే బయటి ప్రాంతాలకు వెళ్లాల్సిందే. ఇదే స్ఫూర్తితో అల్వాల గ్రామస్తులు కూడా సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమల్లోకి తెచ్చారు.

ఒక్కడితో మొదలై..

మద్య నిషేదం కోసం పలు గ్రామాల ప్రజలు పోరాటం చేస్తున్నారు. ముందుగా ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన నడుల్ల శేఖర్‌తో పోరాటం మొదలైంది. తమ గ్రామంలో మద్యపానం నిషేధించాలని కోరుతూ గత సెప్టెంబర్‌లో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపట్టాడు. గ్రామ పెద్దలు, మహిళలు రాజకీయాలకు అతీతంగా మద్దతుగా నిలిచారు. స్థానికంగా మద్యం విక్రయిస్తే రూ.50 వేలు జరిమానా విధిస్తామని, మద్యం అమ్మేవారిని పట్టిస్తే రూ.10 వేల నజరానా అందజేస్తామని ప్రకటించడంతో బెల్టు దుకాణాలు మూతపడ్డాయి. ఈ పోరాటం గంట్లవెళ్లి, చౌడమ్మగుట్టతండాలో కూడా కొనసాగుతోంది.

జీవితాలు నాశనం కావొద్దని



గ్రామంలో చాలా మంది మద్యానికి బానిసలవుతున్నారు. ప్రజల జీవితాలు నాశనం కావొద్దని ఆలోచనతో పోరాటం ప్రారంభించా. స్థానికుల మద్దతుతో ఎమ్మెల్యేతో పాటు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశాం. అందరి పోరాటంతో బెల్టు దుకాణాలు మూతపడ్డాయి.

– శేఖర్, కిషన్‌నగర్, ఫరూఖ్‌నగర్ మండలం

మహిళల పోరాటంతోనే నిషేధం



మద్యంతో చాలా మంది జీవితాలు బలైపోతున్నాయి. దీంతో గ్రామంలో బెల్టు దుకాణాలు తొలగించాలని, మహిళలు పెద్ద ఎత్తున బయటికి వచ్చారు. మద్యం సీసాలను ధ్వంసం చేశారు. ఈ దెబ్బతో గ్రామంలో 14 ఏళ్లుగా మద్యం నిషేధం అమలవుతోంది.

– ఎదిర కళమ్మ, బొదనంపల్లి, కేశంపేట